క్లుప్తంగా

పంపన సాయిబాబుకు గాంధీ శాంతి పురస్కారం


సాయిబాబాను సత్కరిస్తున్న నిర్వాహకులు

వీరవాసరం: జిల్లా సర్వోదయ మండలి ఆధ్వర్యాన గాంధేయ వాదంపై కవితా రచనల పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో వీరవాసరం జెడ్పీ హైస్కూల్ గ్రేడ్ - 1 తెలుగు ఉపాధ్యాయుడు పంపన సాయిబాబు పాల్గొని మనది గాంధేయ వాదం – రావాలి గాంధీ యుగం అని రాసిన కవితకు గాంధీ శాంతి పురస్కారం అందజేశారు. జిల్లా సర్వోదయ మండలి ప్రధాన కార్యదర్శి ఇందుకూరి ప్రసాదరాజు, సభ్యులు పెదనింద్రకొలను గాంధీ భవన్ నందు ఆయనను సత్కరించారు. ప్రధానోపాధ్యాయుడు జిత్తిగ శ్రీనివాసు, ఉపాధ్యాయులు సాయిబాబును అభినందించారు.

కోవిడ్ అమర వైద్యులకు నివాళులు


నివాళులర్పిస్తున్న దృశ్యం

భీమవరం (ప్రకాశంచౌక్): ఇండియన్ మెడికల్ అసోసియేషన్ భీమవరం శాఖ ఆధ్వర్యాన మంగళవారం కోవిడ్ అమర వైద్యుల సంస్మరణ సభ నిర్వహించారు. సభకు అధ్యక్ష, కార్యదర్శులు డాక్టర్ జి.బాలకృష్ణ రాజు, డాక్టర్ ఎస్.శంకర్ కుమార్ వర్మ, వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ వీవీజే సోమ రాజు, ట్రెజరర్ డాక్టర్ కె.బాలమురళీకృష్ణ సంఘ సభ్యులు హాజరై కోవిడ్ అమర వైద్యులకు నివాళులర్పించి, వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. కార్యక్రమంలో రంగ సాయి, పిప్పళ్ళ ప్రసాద్, బాషా తదితరులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతతోనే ఆరోగ్య భారతం


ర్యాలీలో పాల్గొన్న చైర్‌పర్సన్ హైమావతి

ఆకివీడు: పరిసరాల పరిశుభ్రతతోనే దేశం ఆరోగ్యంగా ఉంటుందని నగర పంచాయతీ చైర్‌పర్సన్ జామి హైమావతి అన్నారు. జాతీయ పరిశుభ్రతా దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం స్థానిక నగర పంచాయతీ వద్ద ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ర్యాలీ చేపట్టి ప్రజల్లో అవగాహన పెంచారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పట్టణంలోని 18 స్లమ్ సమాఖ్యలు ఆయా ప్రాంతాల పరిశుభ్రతకు కృషి చేయాలన్నారు. మెప్మా అధ్యక్షురాలు మోరా జ్యోతిరెడ్డి మాట్లాడుతూ స్వయం సహాయక సంఘాల సభ్యులు తమ ప్రాంతాల్ని పరిశుభ్రంగా ఉంచుతూ ప్రజలు పరిశుభ్రత పాటించేలా కృషి చేయాలన్నారు. కుళాయిల ద్వారా వచ్చే నీటిని కాచుకుని తాగడం వల్ల చాలా రకాల జబ్బులు దూరమవుతాయని చెప్పారు. కార్యక్రమంలో కమిషనర్ జీకే మోహన్, టీఎంసీ మోహన్, అనిల్, ఆర్పీలు పాల్గొన్నారు.

కులగణన సర్వేను త్వరగా పూర్తి చేయాలి

యలమంచిలి: కులగణన సర్వేను త్వరితగతిన పూర్తి చేయాలని హౌసింగ్ ఈఈ, మండల ప్రత్యేకాధికారి బి.వెంకటమరణ కోరారు. పెనుమర్రులో జరుగుతున్న కులగణన సర్వేను మంగళవారం ఆయన పరిశీలించారు. ఇప్పటికే 80 శాతం సర్వే పూర్తయ్యిందని, మిగిలిన 20 శాతం కూడా త్వరగా పూర్తి చేయాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ కవురు గోపి, వైఎస్సార్ సీపీ గ్రామ అధ్యక్షుడు పాకా సూర్యనారాయణ, హౌసింగ్ ఏఈ కె.రాజారామ్, హౌసింగ్ వర్క్ ఇన్‌స్పెక్టర్ మాతా బాబ్జి తదితరులు పాల్గొన్నారు.

ఆర్డీవో అంబరీష్ సేవలు అభినందనీయం


ఆర్డీవో అచ్యుత్ అంబరీష్‌కు పుష్పగుచ్ఛం అందిస్తున్న తహసీల్దార్

నరసాపురం: ఆర్డీవో ఎం.అచ్యుత్ అంబరీష్ సేవలు అభినందనీయమని నరసాపురం తహసీల్దార్ షేక్ సయ్యద్ ఫాజిల్ అన్నారు. రిపబ్లిక్ డే వేడుకల్లో ఆర్డీవో జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా బెస్ట్ సర్వీస్ అవార్డు అందుకున్న సందర్భంగా మంగళవారం తహసీల్దార్‌తో పాటు కార్యాలయ ఉద్యోగులు ఆర్డీవోను కలసి అభినందించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ అంబరీష్ నిత్యం ఉద్యోగుల్లో స్ఫూర్తిని నింపుతూ విధులు సక్రమంగా నిర్వర్తించటానికి తోడ్పాటు అందిస్తారని చెప్పారు. ఆర్డీవో అంబరీష్ మాట్లాడుతూ విధులను సక్రమంగా నిర్వర్తిస్తే గుర్తింపు వస్తుందని చెప్పారు.

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నర్సింహరాజు


పాందువ్వలో ఓహెచ్ఎస్ఆర్ ట్యాంక్ నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న డీసీసీబీ చైర్మన్ నర్సింహరాజు

ఉండి: ప్రజా సంక్షేమమే వైఎస్సార్ సీపీ ప్రభుత్వ ధ్యేయమని డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నర్సింహరాజు అన్నారు. మంగళవారం మండలంలోని పాందువ్వ గ్రామంలో జల్‌జీవన్ మిషన్ నిధులు రూ.81 లక్షలతో 62 వేల లీటర్ల సామర్థ్యం గల ఓహెచ్ఎస్ఆర్,1 ఎంఎల్‌డీ మైక్రో ఫిల్టర్, పైపులైన్ విస్తరణ పనులకు పీవీఎల్ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా పీవీఎల్ మాట్లాడుతూ నియోజకవర్గంలో జల్‌జీవన్ నిధులతో పైపులైన్ విస్తరణ, కొత్త ఫిల్టర్ బెడ్‌లు, ఓహెచ్ఎస్ఆర్‌లు, ఫిల్టర్ మీడియా నిర్మాణం వంటి కార్యక్రమాలను చేపట్టినట్లు తెలిపారు. ఇప్పటికే వివిధ గ్రామాల్లో పనులు పూర్తి చేయడం జరిగిందని అన్నారు.శివారు ప్రాంతాలకు కూడా తాగునీటి ఇబ్బందులు రాకుండా పైపులైన్ విస్తరణ చేయడం జరిగిందని అన్నారు. అలాగే ప్రతి ఇంటికి కుళాయి కనెక్షన్ ఇవ్వడం జరిగిందన్నారు. గత ఎన్నికలకు ముందు వందలాది పనులకు కొబ్బరికాయలు కొట్టి ఓట్లు దండుకున్నారన్నారు. మీకు పనులు చేయాలంటే తప్పకుండా ఓట్లు వేయాలంటూ ప్రజలను మభ్యపెట్టి, భయపెట్టి ఓట్లు వేయించుకున్నారన్నారు. ఇప్పుడు అదేమీ కుదరదని ప్రజలంతా తమకు ఎవరు మంచి చేస్తున్నారో తెలుసుకున్నారన్నారు. నియోజకర్గంలో వేది కోట్ల రూపాయలు సంక్షేమ పథకాల ద్వారా ప్రజలకు అందాయన్నారు. అలాగే గ్రామంలో సీసీరోడ్లు, డ్రెయిన్‌లు, ఓహెచ్ఎస్ఆర్‌లు, ఫిల్టర్ బెడ్‌లు, పైపులైన్ విస్తరణ పనులు వంటివి చేపట్టి, పూర్తి చేసి గ్రామాల అభివృద్ధి వేగవంతం చేశామన్నారు. మాయమాటలు చెప్పడం, రాజకీయాలు చేయడం తనకు తెలియదని ఉన్నది ఉన్నట్లు చెప్పి ప్రజలకు మంచి చేయడమే తెలుసునని అన్నారు. రాజకీయాల్లో కొత్త అధ్యాయానికి ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి నాంది పలికారని అన్నారు.గత ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి వాగ్దానాన్ని అమలు చేసి ప్రజలను ఆర్థికంగా ఎంతో బలోపేతం చేశారని తెలిపారు. ఈ కార్యక్రమంలో అల్లూరి రాంబాబు రాజు, ఇందుకూరి శ్రీహరిరాజు, గొంతే హరీష్, జీ సుందర్‌కుమార్, పెన్మత్స సుబ్బరాజు, దెందుకూరి నర్సింహరాజు, దవిలి నాగేశ్వరరావు, సోడదాసి శ్రీను, తాండ్ర పాపాయమ్మ, కూన సత్యనారాయణ, దార్లంక రాంబాబు, దవిలి అప్పన్న తదితరులు పాల్గొన్నారు.

'ఆసరా.. మనసారా' ఉత్సవానికి తరలి వెళ్లిన డ్వాక్రా మహిళలు

పెనుమంట్ర: ఆచంట నియోజకవర్గం తూర్పుపాలెంలో మాజీ మంత్రి, ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు చెరుకువాడ శ్రీరంగనాథరాజు ఆధ్వర్యాన 10 రోజుల పాటు జరిగే 'ఆసరా.. మనసారా' దశ ఉత్సవాలు మంగళవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. తొలిరోజు పెనుమంట్ర మండలం నుంచి సుమారు 1,400 మంది పైగా డ్వాక్రా అక్కచెల్లెమ్మలు తరలి వెళ్లారు. మండలంలో 32 గ్రామ సంఘాలు ఉండగా, 1,365 గ్రూపులు పనిచేస్తున్నాయి. ఇందులో 13,650 మంది సభ్యులుగా ఉన్నారు. ఇందులో 1,163 అర్హత గల సంఘాలకు నాలుగు విడతలుగా రూ.43 కోట్లకు పైగా అక్కచెల్లెమ్మల ఖాతాలో జమ అయింది. దీంతో 10 రోజుల పాటు జరిగే దశ ఉత్సవ సంబరాలకు ప్రతిరోజూ మండలం నుంచి 1,500 మంది హాజరై ఉత్సవాల్లో ఆనందాన్ని పంచుకోవాలని నిర్ణయించుకుని హాజరవుతున్నారు.

వేసవిలో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా చర్యలు


మాట్లాడుతున్న చైర్‌పర్సన్ హైమావతి

ఆకివీడు: వేసవిలో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు నగర పంచాయతీ చైర్‌పర్సన్ జామి హైమావతి తెలిపారు. స్థానిక నగర పంచాయతీ కార్యాలయంలో మంగళవారం అత్యవసర సమావేశం జరిగింది. సమావేశానికి అధ్యక్షత వహించిన ఆమె మాట్లాడుతూ స్థానిక భుజబలరాయుడు మంచినీటి చెరువు, సమ్మర్ స్టోరేజ్, ఆనాల చెరువు, గాలిబ్ చెరువుల్లో నీరు నింపేందుకు క్రాస్ బండలు వేసి నీరు తోడుటకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. అందుకు గానూ అజెండాకు తీసుకువచ్చిన రూ.6.55 లక్షల నిధుల్ని సాధారణ నిధుల నుంచి ఖర్చు చేయుటకు సమావేశం ఆమోదం తెలిపిందన్నారు. స్థానిక సుబ్రహ్మణ్యస్వామి గుడి వద్ద నుంచి పెద్దింటి అమ్మవారి ఆర్చి వరకు సీసీ రోడ్డు నిర్మాణానికి సాధారణ నిధుల నుంచి రూ.5.50 లక్షలు వెచ్చించే విధంగా కౌన్సిల్ ఆమోదంతో తీర్మానం చేసినట్లు తెలిపారు. భుజబలరాయుడు చెరువు వద్ద ఎస్ఎస్ ఫిల్టర్స్ రీచార్జింగ్, దొరగారి చెరువు వద్ద మరో ఎస్ఎస్ ఫిల్టర్స్ రీచార్జింగ్‌కు 12.02 శాతం తక్కువ టెండర్‌తో పనులు ఆమోదించగా, సాంకేతిక అనుమతి వచ్చినందున సదరు కాంట్రాక్టర్‌కు వర్క్ అలాట్‌మెంట్ ఇచ్చేందుకు సమావేశం ఏకగ్రీవంగా తీర్మానించింది. పారిశుద్ధ్య పనులకు అత్యవసరమైన ట్రాక్టర్, నాలుగు ట్రాలీలు(ట్రక్కు) కొనుగోలుకు రూ.10.82 లక్షలు 15వ ఆర్థిక సంఘం నిధుల నుంచి వెచ్చించేందుకు, సాధారణ నిధుల నుంచి వెచ్చించుటకు సమావేశం ఏకగ్రీవంగా ఆమోదం తెలిపింది. వీటితో పాటు బ్లీచింగ్, స్ట్రీట్‌లైట్లు కొనుగోలుకు సమావేశం తీర్మానించింది. సమావేశంలో 12వ వార్డు కౌన్సిలర్ కట్టా రవీంద్రనాథ్ ఠాగూర్ మాట్లాడుతూ స్థానిక జాతీయ రహదారి నుంచి అయిభీమవరం వెళ్లే కేజీ రోడ్డులో స్పీడు బ్రేకర్లు వేయాలని, తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని, ఇటీవల కాలంలో 4గురు వ్యక్తులు చనిపోయారని సమావేశం దృష్టికి తీసుకువచ్చారు. సమావేశంలో వైస్ చైర్మన్లు పుప్పాల పండు, వంగా జ్యోత్స్న, విప్ పడాల శ్రీనివాసరెడ్డి, కౌన్సిలర్లు గేదల అప్పారావు, మోటుపల్లి కుమారి, తిరుమారెడ్డి మాధవి, అస్రపున్నీస్సాబేగం, దొడ్డి జగదీష్, గుండుగొలను సావిత్రి, మన్నే లలితాదేవి, ఎండీ జక్కీ, కమిషనర్ జి.కృష్ణమోహన్ పాల్గొన్నారు.

పేదలకు వరం 'జగనన్న ఆరోగ్య సురక్ష'


చెరుకుమిల్లిలో మందులు పంపిణీ చేస్తున్న సర్పంచ్ నందమూరి ప్రకాశం

ఆకివీడు: జగనన్న ఆరోగ్య సురక్ష పథకం పేదలకు వరం అని చెరుకుమిల్లి సర్పంచ్ నందమూరి ప్రకాశం అన్నారు. మంగళవారం గ్రామంలో రెండో విడత ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం నిర్వహించారు. సర్పంచ్ ప్రకాశం మాట్లాడుతూ సాధారణ వ్యాధులతో పాటు శిబిరంలో గుండె, ఈసీజీ పరీక్షలు సైతం ఉచితంగా చేస్తున్నట్లు తెలిపారు. చిన్న పిల్లల వైద్యుడు రంగారావు మాట్లాడుతూ పిల్లల్లో రక్తహీనత, కంటి లోపాలు అక్కడక్కడా కన్పిస్తున్నాయన్నారు. ఐరన్ మాత్రలు, విటమిన్ మాత్రలు అందజేస్తున్నట్లు చెప్పారు. గ్రామంలోని ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు 120 మందికి పైగా కంటి పరీక్షలు, ఆరోగ్య పరీక్షలు నిర్వహించమన్నారు. కార్యక్రమంలో మండల పరిషత్ ఉపాధ్యక్షుడు సైదాల సూర్యనారాయణ, వైఎస్సార్ సీపీ గ్రామ అధ్యక్షుడు మంతెన శ్రీరామచంద్రరాజు(సుఖీ), ఆర్బీకే మండల డైరెక్టర్ ఎరిచర్ల సాంబర్లిన్, మాజీ ఉప సర్పంచ్ గ్లాడ్‌సన్, కురెళ్ళ మాణిక్యాలరావు, సాల్మన్‌రాజు, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు, సచివాలయ సిబ్బంది, ఈవోపీఆర్డీ సుబ్బారావు పాల్గొన్నారు.

వేగంగా ఆర్ అండ్ బీ రోడ్డు నిర్మాణ పనులు


చిలుకూరులో పనులను పరిశీలిస్తున్న సర్పంచ్ వెంకట సోమరాజు తదితరులు

ఉండి: నియోజకవర్గంలో ఆర్అండ్‌బీ రోడ్ల నిర్మాణంపై ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రత్యేక దృష్టి సారించడంతో మంజూరు కాపాబడిన ప్రత్యేక నిధులతో రోడ్ల పనులు వేగంగా జరుగుతున్నాయి. దీనిలో భాగంగా మండలంలోని చిలుకూరులో రూ.కోటితో నిర్మాణం చేపట్టిన ఆర్అండ్‌బీ రోడ్డు పనులు వేగంగా నిర్వహిస్తున్నారు. రోడ్డు విస్తరణలో భాగంగా ప్రధాన గ్రామంలోని రోడ్డుకు ఇరువైపులా ఆక్రమణలు తొలగించడంతో పాటుగా విస్తరణ పనులను వాయువేగంతో చేపట్టారు. గ్రామ సర్పంచ్ ముదునూరి వెంకటసోమరాజు ఆధ్వర్యంలో గ్రామ పెద్దలు విస్తరణ పనులను మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నర్సింహరాజు ప్రత్యేక చొరవతో చిలుకూరు గ్రామంలో ఆర్అండ్‌బీ రోడ్డు నిర్మాణం జరుగుతుందన్నారు. ఒకవైపు సంక్షేమం, మరోవైపు గ్రామాల అభివృద్ధి జగన్‌మోహన్‌రెడ్డితోనే సాధ్యపడుతుందన్నారు. చిలుకూరు గ్రామంలో రోడ్డు నిర్మాణం చేయడంపై గ్రామ ప్రజలతో పాటు వాహనదారులు కూడా తమ హర్షం వ్యక్తం చేస్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఉపసర్పంచ్ కూనపరాజు రామకృష్ణంరాజు, వేగేశ్న రాంబాబురాజు, వేగేశ్న సత్యనారాయణరాజు తదితరులు పాల్గొన్నారు.

పీఎస్ఎం స్కూల్ విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు


ఎన్ఎంఎంఎస్ స్కాలర్‌షిప్‌కు ఎంపికైన విద్యార్థినులను అభినందిస్తున్న హెచ్ఎం

భీమవరం: పట్టణంలోని పొట్టి శ్రీరాములు మున్సిపల్(పీఎస్ఎం) గరల్స్ హైస్కూల్ విద్యార్థినులు 8 మంది నేషనల్ మీన్స్ మెరిట్ స్కాలర్‌షిప్ (ఎన్ఎంఎంఎస్)కు ఎంపికయ్యారని ప్రధానోపాధ్యాయిని జె.సుధారాణి తెలిపారు. డిసెంబర్‌లో జరిగిన స్కాలర్‌షిప్ టెస్ట్‌లో విద్యార్థినులు టి.నందిని, టి.ప్రసన్న, జి.అభిత, కె.పార్వతి, కేహెచ్ మంజీర, ఎం.గురుప్రణతి, వై.అనిత, వై.రజని ప్రతిభ కనబర్చినట్లు చెప్పారు. ఎన్ఎంఎంఎస్‌కు ఎంపికైన విద్యార్థులకు 9వ తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు ఏటా రూ.12 వేలు చొప్పున స్కాలర్‌షిప్ అందిస్తారని సుధారాణి వివరించారు.

ప్రతిభకు ప్రోత్సాహం

ఆకివీడు: మండలంలోని అయిభీమవరం జెడ్పీ హైస్కూల్ 9వ తరగతి విద్యార్థి కె.శ్రీరామ్ సాగర్ జాతీయ మెరిట్ స్కాలర్‌షిప్‌కు ఎంపికైనట్లు హెచ్ఎం సన్నిధి వెంకటేశ్వరరావు తెలిపారు. ఉన్నత చదువులకు ఉపయోగపడేలా పలు జాతీయ, అంతర్జాతీయ సంస్థలతో పాటు కేంద్ర ప్రభుత్వ ప్రోత్సాహకం అందిస్తుందన్నారు. జాతీయ స్థాయిలో నిర్వహించిన పరీక్షలో సాగర్ తన ప్రతిభను చాటి స్కాలర్‌షిప్‌కు ఎంపికయ్యాడని చెప్పారు.

విభజన హామీలను నెరవేర్చాలి


భీమవరంలో ఆత్మగౌరవ దీక్ష చేస్తున్న వామపక్షాల నాయకులు

భీమవరం: రాష్ట్రానికి ప్రత్యేక హోదా, రాజధాని నిర్మాణానికి, వెనుకబడిన జిల్లాలు, ప్రాంతాలకు ప్యాకేజీలు, నిధులు, రైల్వేజోన్ ఇవ్వాలని డిమాండ్ చేస్తూ మంగళవారం భీమవరంలో వామపక్షాల ఆధ్వర్యాన నిరసన కార్యక్రమం చేపట్టారు. ముందుగా గాంధీజీ చిత్రపటానికి పూలమాల వేసి ఆంధ్రుల హక్కుల ఆత్మగౌరవ దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు జేఎన్‌వీ గోపాలన్ మాట్లాడుతూ విభజిత ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా ఇస్తామని హామీ ఇచ్చిన బీజేపీ అధికారంలోకి వచ్చి 10 ఏళ్లు కావస్తున్న హామీని నెరవేర్చలేదని విమర్శించారు. ప్రత్యేక హోదా కోసం పోరాటం చేస్తున్నా ప్రధాని నరేంద్ర మోడీ పట్టించుకోకపోవడం దుర్మార్గమని దుయ్యబట్టారు. కడపలో ఉక్కు ఫ్యాక్టరీ, విశాఖకు రైల్వేజోన్, రాజధాని, పోలవరం ప్రాజెక్టుల నిర్మాణానికి నిధులు ఇస్తామని ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా రాష్ట్రానికి బీజేపీ ప్రభుత్వం ద్రోహం చేసిందన్నారు. సీపీఐ జిల్లా కార్యదర్శి కోనాల భీమారావు మాట్లాడుతూ 2014లో ఏపీ విభజన సందర్భంగా పార్లమెంట్ సాక్షిగా రాష్ట్రానికి ఇచ్చిన విభజన హామీలు వేటినీ అమలు చేయకుండా తాత్సారం చేస్తున్నారని మండిపడ్డారు. కార్యక్రమంలో కౌలురైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.హరిబాబు, బి.వాసుదేవరావు, చెల్లబోయిన రంగారావు, మల్లుల సీతారాంప్రసాద్, వంశీరెడ్డి, దండు శ్రీనివాసరాజు, వెంకటపతిరాజు, జక్కంశెట్టి సత్యనారాయణ, కలిపిండి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

క్రీడల్లో రాణిస్తే ఉద్యోగావకాశాలు


విద్యార్థులను అభినందిస్తున్న కళాశాల యాజమాన్యం

భీమవరం: విద్యార్థులు క్రీడల్లో రాణిస్తే శారీరక శక్తితో పాటు స్పోర్ట్స్ కోటాలో ఉద్యోగావకాశాలు పొందవచ్చునని భీమవరం ఎస్ఆర్‌కేఆర్ ఇంజినీరింగ్ కళాశాల సెక్రటరీ, కరస్పాండెంట్ సాగి రామకృష్ణ నిశాంత్ వర్మ అన్నారు. కళాశాలకు చెందిన విద్యార్థి జి.ఈశ్వరరావు ఇటీవల జరిగిన బాడీ బిల్డింగ్ పోటీల్లో గోల్డ్ మెడల్స్ సాధించిన సందర్భంగా మంగళవారం కళాశాలలో ఏర్పాటు చేసిన అభినందన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. విద్యార్థిని పి.సత్యవేణి ఇంటర్ కాలేజ్ పోటీలు అథ్లెటిక్స్‌లో సిల్వర్ మెడల్స్ సాధించి జాతీయస్థాయి పోటీలకు ఎంపికైందన్నారు. అథ్లెటిక్స్ పోటీల్లో బి.చైతన్యలహరి, ఎం.శ్యామల, కె.నవీన విజయం సాధించగా, మెన్ అథ్లెటిక్స్ పోటీల్లో ఎస్.రవినాయక్ బ్రాంజ్ మెడల్ సాధించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ ఎం.జగపతిరాజు, ప్రిన్సిపాల్ కేవీ మురళీకృష్ణంరాజు, ఫిజికల్ డైరెక్టర్ సీహెచ్ హరిమోహన్, అసిస్టెంట్ ఫిజికల్ డైరెక్టర్ జి.సారిక తదితరులు పాల్గొన్నారు.

మహాత్ముని ఆశయాలను సాధించాలి


భీమవరంలో కుష్టు వ్యాధి నివారణ పక్షోత్సవాలను ప్రారంభిస్తున్న దృశ్యం

భీమవరం (ప్రకాశంచౌక్): మహాత్ముని ఆశయాలను నెరవేర్చడమే నేటి యువత బాధ్యత అని భీమవరం ఎస్టీవో అల్లూరి రవివర్మ అన్నారు. మహాత్మా గాంధీ వర్ధంతి పురస్కరించుకుని శ్రీ విజ్ఞాన వేదిక ఆధ్వర్యాన క్విట్ ఇండియా స్థూపం వద్ద జాతీయ కుష్టు వ్యాధి నివారణ పక్షోత్సవాలను ప్రారంభించారు. ఆదిత్య డిగ్రీ కళాశాల విద్యార్థులతో శాంతి ర్యాలీ నిర్వహించారు. డీఎన్నార్ కళాశాల రిటైర్డ్ ప్రిన్సిపాల్ ఎం.రఘుపతి రాజు, కెమిస్ట్రీ రిటైర్డ్ హెడ్ కె.భూపతిరాజు మాట్లాడుతూ అహింస, శాంతి ఆయుధాలుగా మహాత్మా గాంధీ స్వాతంత్ర్యం సాధించారని అన్నారు. నిర్వాహకుడు చెరుకువాడ రంగసాయి మాట్లాడుతూ వచ్చేనెల 13వ తేదీ వరకు పక్షోత్సవాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. అనంతరం ప్రకాశం చౌక్ వరకు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో అరసవల్లి సుబ్రహ్మణ్యం, ఎస్కే చాన్ బాషా, ఎన్ఎస్ఎస్ ఆఫీసర్ సురేష్, సత్యనారాయణ, పిప్పళ్ల ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

సీఎం జగన్‌కు రుణపడి ఉంటా

పాలకొల్లు ఏఎంసీ చైర్మన్ సాలా దేవి

పాలకొల్లు అర్బన్: దేశంలోనే ప్రప్రథమంగా షెడ్యూలు తెగల సామాజిక వర్గానికి చెందిన తనను నియోజకవర్గ స్థాయి పదవిలో కూర్చోబెట్టిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి జీవితాంతం రుణపడి ఉంటానని పాలకొల్లు ఏఎంసీ చైర్మన్ సాలా దేవి అన్నారు. ఏఎంసీ చైర్మన్‌గా ఆమె మంగళవారం పదవి బాధ్యతలు స్వీకరించారు. ఏఎంసీ వైస్ చైర్మన్‌గా పెన్మెత్స వెంకట సత్య సూర్యనారాయణరాజు (డీటీడీసీ బాబు), డైరెక్టర్లుగా కలిగితి సుగుణ సుందర కుమారి, కల్యాణం గంగాధరరావు, వడ్లపాటి సుజన కుమారి, కుసుమే ఝాన్సీ హేమలత, మేళం శేషవేణి, సప్పరపు శంకర పార్వతి, దొమ్మేటి ఏడుకొండలు, మహ్మద్ జరీనా బేగం, మంద హరికుమార్, దొంగ నాగలక్ష్మి, నడపన వెంకట సుబ్బారావు, సనిశెట్టి లీలాభవన్నారాయణ, జమ్ము ముత్యంజయరావు, గుర్రాల వెంకట్రావుకు ఏఎంసీ కార్యదర్శి బాధ్యతలు అప్పగించారు. కార్యక్రమంలో శ్రీ క్షీరారామలింగేశ్వరస్వామి దేవస్థానం చైర్మన్ కోరాడ శ్రీనివాసరావు, ప్రభుత్వాసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యుడు చినిమిల్లి గణపతిరావు తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ విజయానికి శ్రమిద్దాం

పాలకొల్లు అర్బన్: పాలకొల్లు నియోజకవర్గంలో వైఎస్సార్ సీపీ విజయానికి నాయకులు,కార్యకర్తలు అహర్నిశలు శ్రమించాలని నియోజకవర్గ ఇన్‌చార్జ్ గుడాల శ్రీహరి గోపాలరావు (గోపి) కోరారు. పట్టణంలోని 3వ వార్డు ఇన్‌చార్జ్‌గా పెంటపాటి కృష్ణను నియమించారు. ఈ సందర్భంగా వార్డు నాయకులు, కార్యకర్తలతో ప్రత్యేకంగా సమావేశమైన ఆయన పార్టీ విజయానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. రానున్న మూడు నెలలు ప్రతి ఒక్కరికీ కీలక సమయమని, అవసరమైతే సొంత పనులు వాయిదా వేసుకుని వైఎస్సార్ సీపీ విజయానికి కృషి చేయాలని కోరారు. పార్టీ కోసం పనిచేసిన ప్రతి కార్యకర్తను గుర్తుపెట్టుకుని వారికి నామినేటెడ్ పదవుల్లో ప్రాధాన్యత ఇస్తామన్నారు. ఈ సందర్భంగా పెంటపాటి కృష్ణకు గుడాల గోపి పుష్పగుచ్ఛం అందజేసి అభినందించారు. జేసీఎస్ 2 కన్వీనర్ మోర్త గిరీష్, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

కుసుమ హరనాథ సంకీర్తనలు, భజన కార్యక్రమం

ఆకివీడు: స్థానిక కాకర్ల వారి వీధిలో కాకర్ల దాసు, ఉమాదేవి దంపతుల ఆధ్వర్యాన మంగళవారం నిరంతరం కుసుమ హరనాథ సంకీర్తనలతో భజన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. కుసుమ హరనాథ దివ్య ఆశీస్సులతో ప్రతి ఏటా స్వామివారి కల్యాణోత్సవంతో పాటు భజన కార్యక్రమాల్ని నిర్వహిస్తుంటారు. రాష్ట్ర నలుమూలల నుంచే కాక, ఇతర రాష్ట్రాల నుంచి భక్తులు భజన సంకీర్తనలకు హాజరవ్వడం విశేషం.

క్యాన్సర్ బాధితునికి ఆర్థిక సాయం అందజేత

భీమవరం: లివర్ క్యాన్సర్‌తో బాధపడుతున్న పట్టణంలోని 3వ వార్డుకు చెందిన కప్పిరి మనోహర్‌కు చికిత్స నిమిత్తం కృష్ణ బలిజ సేవా సమితి రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ గంటా త్రిమూర్తులు, నాగలక్ష్మి దంపతులు మంగళవారం రూ.15 వేలు ఆర్థిక సాయం అందజేశారు. త్రిమూర్తులు మాట్లాడుతూ ఇటీవల మనోహర్ తల్లి అనారోగ్యంతో మృతి చెందగా రూ.10 వేలు ఆర్థిక సాయం అందించామని ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న మనోహర్ అనారోగ్యానికి గురికావడంతో వైద్యం కోసం ఆర్థిక సాయం చేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో మద్దుల రాము, మైలబత్తుల ఐజాక్ బాబు, చెల్లబోయిన సుబ్బారావు, యలమంచిలి శ్రీను, కందుకూరి ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

భీమవరం అర్బన్: భీమవరం రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలో రోడ్డు ప్రమాదానికి గురైన ఓ వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందడంతో పోలీసులు కేసు నమోదు చేశారు. పాలకొల్లు మండలం జిన్నూరు గ్రామానికి చెందిన బొర్ర ఆంజనేయులు(69) యనమదుర్రులోని తన కుమార్తె చెక్కపల్లి ప్రభావతి ఇంటికి సంక్రాంతి పండుగకు వచ్చాడు. ఈనెల 24న ఆంజనేయులు రోడ్డుపై నడుచుకుంటూ వెళుతుండగా వెనుక నుంచి బొలెరో వ్యాన్ ఢీకొట్టడంతో ఆస్పత్రికి తరలించారు. అప్పటి నుంచి భీమవరంలోని ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న అతను మంగళవారం మృతి చెందడంతో కుమార్తె ఇచ్చిన ఫిర్యాదు మేరకు హెడ్ కానిస్టేబుల్ పి.మహేశ్వరరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బాడీ బిల్డింగ్ పోటీలు అభినందనీయం

ఎస్సై వెంకటేశ్వరరావు


ఎస్సై వెంకటేశ్వరరావును సన్మానిస్తున్న నిర్వాహకులు

భీమవరం: బాడీ బిల్డింగ్ పోటీల ద్వారా యువతను ప్రోత్సహించడం అభినందనీయమని భీమవరం వన్‌టౌన్ ఎస్సై ఎం.వెంకటేశ్వరరావు అన్నారు. మంగళవారం పట్టణంలోని కె 12 జిమ్ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని ఏర్పాటు చేసిన మిస్టర్ భీమవరం బాడీ బిల్డింగ్ అండ్ మోడలింగ్ చాంపియన్‌షిప్ పోటీలను ఆయన ప్రారంభించి మాట్లాడారు. పేద కుటుంబాలకు చెందిన యువతకు బాడీ బిల్డింగ్‌లో శిక్షణ ఇచ్చి ప్రోత్సహిస్తున్న జిమ్ అధినేత షేక్ ఖాసింను అభినందించారు. అనంతరం పోటీల్లో విజేతలకు ట్రాఫిక్ ఎస్సై వై.నాగలక్ష్మి చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో రాష్ట్ర బాడీ బిల్డింగ్ అసోసియేషన్ కార్యదర్శి వాడపల్లి శ్రీనివాసరాజు, జిల్లా బాడీ బిల్డింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు కటారి రవిశంకర్, విస్సాకోడేరు గ్రామ సర్పంచ్ బొల్లా శ్రీనివాస్, విజ్ఞాన వేదిక సేవా సంస్థ అధ్యక్షుడు అల్లు శ్రీనివాస్, వలవల ఫణి, కొక్కిరి చిట్టిబాబు, శనగవరపు గోవర్ధన్ తదితరులు పాల్గొన్నారు.